సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం। 16। జనవరి। 2025



'చెత్త' ఐడియా.. నిధుల దుబారా

మున్సిపల్ అధికారులు ప్రజల సొమ్మును దుబారా చేస్తున్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి అద్దె వాహనాలతో కాలం నెట్టుకొస్తున్నారు.

8లో



టమాట కిలో రూ.15

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.7°/ 17.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తెల్లవారుజామున చలి తీవ్రత అధికంగానే ఉంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం
- మంత్రి జన్మదినానికి వచ్చి వెళ్తుండగా ఘటన



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు

పెనుకొండ: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామంత్రి సవిత పుట్టినరోజు వేడుకలకు వచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపి స్వగ్రామానికి తిరిగి వెళ్తూ ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరు చనిపోగా మరొకరు మృత్యువుతో పోరాడుతున్నారు. వివరాల్లోకెళితే.. రొద్దం మండలం ఎం. కొత్తపల్లికి చెందిన బోయ సంజీవప్ప, బోయ వీరన్న టీడీపీ కార్యకర్తలు. బుధవారం మంత్రి సవిత పుట్టినరోజు కావడంతో శుభాకాంక్షలు తెలపడానికి పెనుకొండకు వచ్చారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అయితే పెనుకొండ రైల్వేగేటు దాటిన తర్వాత మైక్రోస్టేషన్ వద్ద ఘాట్ రోడ్డులో వాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన బోయ సంజీవప్పను పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. తీవ్రంగా గాయపడిన బోయ వీరన్నను బెంగళూరుకు తరలించారు. అతని పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

దాడి చేసిన కానిస్టేబుల్ వీఆర్‌కు..

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం: యువకుడిపై అకారణంగా దాడి చేసిన కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపారు. నగరంలో మూడు రోజుల క్రితం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇంతియాజ్ అహమ్మద్‌పై వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నారాయణస్వామి భౌతికదాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై సాక్షిలో 'ఖాకీల కర్కశం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు.. మేయర్ వసీం సలీం ఆధ్వర్యంలో అనంతపురం డీఎస్పీని కలిసి దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎస్పీ జగదీష్.. ఘటనపై విచారించాలని అనంతపురం డీఎస్పీ వి. శ్రీనివాసరావును ఆదేశించారు. ప్రాథమిక విచారణ అనంతరం కానిస్టేబుల్ నారాయణస్వామిని వీఆర్‌కు పంపుతూ ఎస్పీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని ఎస్పీ స్పష్టం చేశారు.

గంజాయి బ్యాచ్ వీరంగం



బాధితుడు బేల్దారి నాగేంద్ర


తాడిపత్రిటౌన్: గంజాయి బ్యాచ్ మళ్లీ వీరంగం సృష్టించింది. మత్తులో బేల్దారిపై కత్తితో దాడి చేసి గాయపరిచింది. పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన బేల్దారి నాగేంద్ర బుధవారం సాయంత్రం తన ఇంటి సమీపంలోని టీ స్టాల్ వద్ద టీ తాగుతున్నాడు. ఈ క్రమంలోనే గంజాయి సేవించి అక్కడికి చేరుకున్న పట్టణానికి చెందిన యూనస్, యోసెన్, దీపక్ అలియాస్ దూపర్‌లు కత్తితో నాగేంద్రపై దాడి చేసి పరారయ్యారు. గాయపడిన నాగేంద్రను స్థానికులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సీసీ ఫుటేజీ సాయంతో నిందితులను గుర్తించారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు.

జస్టిస్ గుణరంజన్‌కు ఘన స్వాగతం



హైకోర్టు అదనపు జడ్జి గుణరంజన్‌కు స్వాగతం పలుకుతున్న రాకెట్లవాసులు

ఉరవకొండ: ఏపీ హైకోర్టు అదనపు జడ్జి జస్టిస్ గుణరంజన్‌కు ఘన స్వాగతం లభించింది. మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, గ్రామ సర్పంచ్ దెయ్యాల నాగరాజుతో పాటు ప్రజలు జడ్జికి స్వాగతం పలికారు.





ఖాద్రీశుడి పార్వేట ఉత్సవంలో పాల్గొన్న భక్తజనం

పార్వేట ఉత్సవం.. ఖాద్రీశుడి వైభవం

నారసింహుడి నామస్మరణతో కదిరి పట్టణం మార్మోగింది. స్వామివారి పార్వేట ఉత్సవానికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో పార్వేట మండప పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఉత్సవంలో భాగంగా వదిలే కుందేళ్లను పట్టుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు.

- కనుల పండువగా ఖాద్రీశుడి పార్వేట ఉత్సవం
- కుందేలును పట్టుకోవడానికి ఎగబడిన భక్తజనం
- తిరువీధుల్లో అశ్వవాహనంపై శ్రీవారి దర్శనం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి పార్వేట ఉత్సవం భక్తుల కోలాహలం మధ్య బుధవారం కనుల పండువగా జరిగింది. ఏటా మకర సంక్రాంతి మరుసటి దినం కనుమ పండుగ నాడు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఖాద్రీశుడు ఆయుధం ధరించి వన విహారార్థం వెళ్లేవారని.. దుష్ట మృగాలను వేటాడి విజయ గర్వంతో తిరిగి వస్తారని.. అందుకే పార్వేట ఉత్సవాన్ని నిర్వహిస్తారని భక్తుల నమ్మకం.

కోలాహలంగా పార్వేట..

పాలపొంగుల ఉత్సవం ముగిసిన తర్వాత స్వామివారు సాయం సంధ్యావేళలో రైల్వేస్టేషన్ సమీపంలోని పార్వేట మండపం వద్దకు చేరుకున్నారు. తర్వాత రైలు కట్ట వద్ద ఎప్పటి లాగానే ఆచారం ప్రకారం కుందేలును జనం మధ్యకు వదిలారు. ఇలా ఒకటి తర్వాత మరొకటి చొప్పున జనం మధ్యకు నాలుగైదు కుందేళ్లను వదిలారు. ఆ సమయంలో కాసేపు భక్తుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. పార్వేట ఉత్సవంలో ఒకప్పుడు కుందేలు స్థానంలో పులిని వదిలేవారని భక్తులు తెలిపారు. భక్తులకు హాని కల్గిస్తుందని కొన్నేళ్లుగా కుందేలును వదులుతున్నట్లు పేర్కొన్నారు. పార్వేట పూర్తి కాగానే స్వామివారు రాయచోటి రోడ్డులో ఉన్న శమీ మండపం వద్దకు చేరుకొని అక్కడ పూజలు అందుకున్నారు.



కుందేళ్లతో యువకులు

ఆలయంలో ప్రత్యేక పూజలు..

నృసింహుని ఆలయంలో బుధవారం ఉదయం స్వామివారికి నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవారు స్తోత్రాద్రి (కదిరి కొండ) వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజలు నిర్వహించిన తర్వాత ఆలయ అర్చకులు పార్వేట విశిష్టతను వివరించారు. స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కదిరి కొండ వద్ద స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీర్వాదాలు తీసుకున్నారు. తర్వాత ఆయన స్వామివారి పల్లకీ మోశారు.

పాల పొంగుల ఉత్సవం..

కదిరి కొండ వద్ద పూజల అనంతరం శ్రీవారు కుమ్మరవాండ్లపల్లి వద్ద ఉన్న పాలు ఆరగింపు మంటపం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. ఆచారం ప్రకారం యాదవులు స్వామివారికి పాల పొంగులు నిర్వహించారు. నారసింహుడు పాలు ఆరగించిన అనంతరం భక్తులకు దర్శనం ఇచ్చారు.

అశ్వవాహనంపై శ్రీవారు..

శమీ మండపం వద్ద పూజల అనంతరం శ్రీవారు విశేషాలంకరణతో అశ్వవాహనంపై పురవీధుల గుండా భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం తిరిగి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద చోరసంవాదం నిర్వహించిన మీదట స్వామివారు తిరిగి ఆలయంలోకి ప్రవేశించడంతో పార్వేట ఉత్సవం ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పార్వేట ఉత్సవంలో లక్ష్మీనారసింహుని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ వి.శ్రీనివాసరెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు కుల మతాలకతీతంగా పార్వేట ఉత్సవంలో పాల్గొన్నారు. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ సీఐలు నారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు.



పాలను పొంగిస్తున్న భక్తులు

ఆదాయం.. అందనంత దూరం!

- ఉమ్మడి జిల్లాలో దారుణంగా పరిస్థితి
- కోలుకోని స్థిరాస్తి రంగం
- అధ్వానంగా జీఎస్టీ వసూళ్లు
- భారీగా పడిపోయిన 'ఆటోమొబైల్' అమ్మకాలు
- ఇతర రంగాల ఆదాయం కూడా 52 శాతం తగ్గుదల
- 'కియా' నుంచి నామమాత్రపు ఆదాయంతో సరి!



సాక్షి ప్రతినిధి, అనంతపురం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలకూ ప్రోత్సాహం లభించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే స్థిరాస్తి రంగానికి ఊపు వచ్చి ఆదాయ వనరులన్నీ బాగుండేవి. జీఎస్టీ వసూళ్లు ఊహించిన దానికంటే మించి ఉండటంతో ఎక్కడా ఇబ్బంది లేకుండా పోయింది. అయితే, గత ఏడు నెలలుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితి తిరగబడింది. ఆదాయ వనరులన్నీ మూసుకు పోయాయి. కనీస లక్ష్యాలు కూడా అందుకోవడం కష్టమైంది. దీంతో అధికార యంత్రాంగానికి ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

పడిపోయిన జీఎస్టీ వసూళ్లు..

ఉమ్మడి జిల్లాలో ప్రధాన ఆదాయ వనరు జీఎస్టీ (గూడ్స్‌అండ్ సర్వీసెస్ ట్యాక్స్)నే. 2019–23 మధ్యకాలంలో సగటున నెలకు జీఎస్టీ వసూళ్లు రూ.550 కోట్లు ఉండేవి. ఇప్పుడు రూ.300 కోట్లు కూడా రావడం లేదు. చివరకు పన్నులు వసూళ్లు కాక మూడు వందల మందికి పైగా నోటీసులు ఇచ్చారు. మరోవైపు వ్యాపారాలు లేవని, పన్నులు కట్టే పరిస్థితి లేదని వ్యాపారులు వాపోతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో ఆదాయం ఇలా	
కేటగిరీ	వసూళ్లు
జీఎస్టీ	రూ.300 కోట్లు
స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్	రూ.142 కోట్లు
ఆటోమొబైల్ రంగం తగ్గుదల	40 శాతం పైనే
కియా సేల్స్‌లో ఏపీకి వచ్చే పన్ను	2 శాతం
ఇతర రంగాల ఆదాయం తగ్గుదల	52 శాతం

'స్థిరాస్తి' కుదేలు

ఉమ్మడి జిల్లాలో స్థిరాస్తి రంగం కుదైలేంది. ఒకప్పుడు కళకళలాడిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నేడు బోసిపోతున్నాయి. రోజుకు నాలుగైదు డాక్యుమెంట్లు వచ్చినా చాలురా దేవుడా అనే పరిస్థితి వచ్చింది. అనంతపురం జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.469 కోట్ల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకూ కేవలం రూ.142 కోట్లు వచ్చింది. శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.248 కోట్ల లక్ష్యానికి గాను కేవలం రూ.85 కోట్లు వసూలైంది.

'కియా' నుంచి అంతంతే..

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 'కియా' కార్ల కంపెనీ నుంచి పన్నుల రూపంలో వస్తున్న మొత్తం చాలా తక్కువగా ఉంటోందని జీఎస్టీ నిపుణులు చెబుతున్నారు. ప్రతి వంద కార్ల ఉత్పత్తిలో ఇక్కడ అమ్మకాలు జరుగుతున్నది కేవలం 2 కార్లే అని, మిగతా కార్లు ఎగుమతి అవుతుండటంతో స్టేట్ జీఎస్టీ పరిధిలోకి రాదని చెబుతున్నారు. దీంతో ఆదాయం చాలా తక్కువగా ఉందంటున్నారు.

ఆటోమొబైల్ రంగం కుదేలు..

గతంలో ఎప్పుడూ లేనంతగా ఆటోమొబైల్ రంగం పడిపోయినట్టు వాహన డీలర్లు చెబుతున్నారు. 2023–24తో పోలిస్తే 40 శాతం అమ్మకాలు కూడా జరగలేదని వాపోతున్నారు. కార్ల కొనుగోళ్లు భారీగా తగ్గాయి. ఎప్పుడూ ద్విచక్ర వాహనాల కొనుగోళ్లతో రద్దీగా ఉండే మార్కెట్ ఈ సారి కళ తప్పింది. గతంలో ఆటోమొబైల్ రంగం నుంచి భారీగా రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తుండేది. అలాంటిది ఇప్పుడు డీలా పడినట్టు తెలుస్తోంది. దీంతో పాటు డీజిల్, పెట్రోల్ నుంచి కూడా అనుకున్న మేర సేల్స్ ట్యాక్స్ రావడం లేదని తేలింది.

పింఛన్.. టెన్షన్

- పింఛన్ల ఏరివేతపై ప్రభుత్వం దృష్టి
- కొత్తవారికి ఇవ్వకుండా ఉన్న పింఛన్లకు కోత
- ఏడు నెలల కాలంలో 6,498 మందికి పింఛన్ కట్
- నేటి నుండి రెండో విడత పరిశీలన

పుట్టపర్తి అర్బన్: పేదరికంలో మగ్గుతున్న వారిని మాయదారి రోగాలు చుట్టుముట్టడంతో ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. ఇలాంటి వారికి భరోసా ఇచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పింఛన్ల తొలగింపు ప్రారంభించింది. తాజాగా గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా రెండో విడత పింఛన్ల పరిశీలన ప్రారంభమవుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

రీవెరిఫికేషన్ పేరుతో...

వివిధ రోగాల బారిన పడి మంచాన పడిన వారికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.10 వేలు పింఛన్ ఇచ్చేవారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే వారి పింఛన్ రూ.15 వేలకు పెంచి పంపిణీ చేస్తోంది. అయితే పింఛన్ల మొత్తాన్ని ఇవ్వలేక పింఛన్ల ఏరివేతకు 5 బృందాలను నియమించడం ఇప్పుడు అలజడికి కారణమైంది. ఈ నెల 6, 7, 8 తేదీల్లో జిల్లాలో పర్యటించిన వైద్య బృందాలు సుమారు 386 లబ్ధిదారులను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. ఇదిలా ఉంటే జిల్లాలో రూ.15 వేలు పింఛన్ల మొత్తం తీసుకుంటున్న లబ్ధిదారులు 1715 మంది ఉన్నారు. ఇప్పుడు రీ వెరిఫికేషన్ పేరుతో మరోసారి వారి ఆరోగ్య పరిస్థితులను వైద్య బృందం సభ్యులు పరిశీలిస్తున్నారు. సర్టిఫికెట్లలో తేడాలు ఉన్నా, రోగులు అందుబాటులో లేకున్నా ఆరోగ్య పరిస్థితి కాస్తా నయమైనా వాటి వివరాలను నమోదు చేసుకొని పింఛన్లను తొలగించనున్నారు.

జిల్లాలో 2,64,475 పింఛన్లు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి జిల్లాలో 2,70,973 పింఛన్లు ఉండగా ప్రస్తుతం జనవరి నెలలో 2,64,475 ఉన్నాయి. కేవలం 7 నెలల కాలంలో సుమారు 6,498 పెన్షన్లు తొలగించారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయకుండానే ఉన్న వాటిని తొలగిస్తున్నారు. ప్రస్తుతం రూ.15 వేల పింఛన్ల తీసుకుంటున్న లబ్ధిదారులు 1715 మంది, రూ.10 వేలు తీసుకుంటున్న వారు 561 మంది, రూ.6 వేలు తీసుకుంటున్న లబ్ధిదారులు 34,476 మంది ఉన్నారు. విడతల వారీగా పరిశీలన పేరుతో ఇందులో చాలా వరకూ పింఛన్లను తొలగించాలన్నదే ప్రభుత్వ కుట్ర అని స్పష్టమవుతోంది.

మార్చిలోపు పరిశీలన పూర్తి చేస్తాం

ఈ నెలాఖరులోపు రూ.15 వేలు అందుకుంటున్న వారి పింఛన్ల పరిశీలన పూర్తి చేస్తారు. అనంతరం రూ. 10 వేలు, రూ.6 వేలు పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారుల పరిశీలనను మార్చిలోగా పూర్తి చేస్తారు. వాటి నివేదికలు ప్రభుత్వానికి పంపుతారు. ఆ నివేదికలను బట్టి వారికి మరోసారి సదరం సర్టిఫికెట్లు మంజూరు చేస్తారు. ప్రస్తుతం అనంతపురంలో సదరం క్యాంపులు సైతం రద్దు చేశారు. పింఛన్ల పరిశీలన పూర్తయిన అనంతరం వాటిని తిరిగి అందజేస్తారు.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

జిల్లా హాకీ జట్టు ఎంపిక



జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టుతో కోచ్, హాకీ ఆంధ్రప్రదేశ్ సభ్యులు

ధర్మవరం: జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టును ఎంపిక చేసినట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బంధనాథం సూర్యప్రకాష్, జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు మదనపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా హాకీ జట్టును ఎంపిక చేశామన్నారు. జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టు సభ్యులుగా శబరీష్‌గౌడ్, ఫజులుద్దీన్, వెంకట్ అభిషేక్, రితీష్, రాంచరణ్, సాధిక్‌వలి, గోవర్ధన్, జశ్వంత్, నవదీప్, ఆదికేశవ, విక్కీ, పోతలయ్య, స్వామి, సచిన్, కార్తీక్, ధనుష్, రాహుల్, పునీత్, చరణ్‌తేజ్ ఉన్నారన్నారు. టీం కోచ్‌గా సాయికుమార్, మేనేజర్‌గా వెంకటేష్‌నాయక్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. హాకీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గౌరీప్రసాద్, జిల్లా కోచ్ హుస్సేన్, గౌరవాధ్యక్షుడు బండి వేణుగోపాల్, వల్లెం వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు ఉడుముల రామచంద్ర పాల్గొన్నారు.



అలంకరణలో దుర్గమ్మ

వైభవంగా జ్యోతుల ఉత్సవం

చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవాన్ని బుధవారం ధర్మవరం పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. దుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.



ధర్మవరంలోని ప్రధాన రహదారిపై కొనసాగుతున్న జ్యోతుల ఉత్సవం

వివరాలు 8లో

క్లుప్తంగా

పచ్చ మూకల అత్యుత్సాహం


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మంత్రి సవిత పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం సోమందేపల్లిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే విషయంలో 'పచ్చ' మూకలు అత్యుత్సాహం ప్రదర్శించాయి. వైఎస్సార్ సర్కిల్‌లో ఇది వరకే ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన ఫ్లెక్సీని దౌర్జన్యంగా చింపేశారు. ఘటనపై వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించి, ఫ్లెక్సీలు చింపి వేసిన వారిపై, రెచ్చగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుపై ఏఎస్ఐ మురళి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కళ్యాణ్, న్యాయవాది బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ - ఏడుగురికి గాయాలు

బత్తలపల్లి: పాత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం అనంతసాగరం గ్రామానికి చెందిన చెరుకూరి ఈశ్వరమ్మ, చెరుకూరి ఈశ్వరయ్య వర్గాల మధ్య కొంత కాలంగా ఓ బంగారు గొలుసు విషయంగా వివాదం నెలకొంది. ఈ విషయంగా ఈశ్వరయ్య మేనల్లుడు ప్రవీణ్‌పై కేసు నమోదు చేశారు. తన మేనల్లుడుపై అక్రమంగా కేసు నమోదు చేయించారంటూ తరచూ ఈశ్వరమ్మ వర్గంతో ఈశ్వరయ్య వర్గీయులు గొడవ పడేవారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇరు వర్గాల మధ్య పరస్పర దాడులు చోటు చేసుకోవడంతో ఈశ్వరమ్మ, హేమంత్, రామాంజనేయులు, ఈశ్వరయ్య, ప్రవీణ్, గవ్వల శివయ్య, గవ్వల ఈశ్వరమ్మ గాయపడ్డారు. ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు చియ్యేడుకు చెందిన హేమంత్, నాగార్జున, రామాంజనేయులు, అనంతసాగరానికి చెందిన శివయ్య, ఆదెప్పతో పాటు మరో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు గవ్వల ప్రవీణ్, శివయ్య, ఈశ్వర్యతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పెరిగిన టెంకాయల విక్రయ ఆదాయం


టెంకాయల వేలం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి శివారున 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన బాట సుంకులమ్మ ఆలయంలో టెంకాలయ విక్రయానికి మంగళవారం వేలం నిర్వహించారు. వేలం దక్కించుకున్న వచ్చే ఏడాది సంక్రాంతి వరకూ ఆలయం వద్ద టెంకాయలను విక్రయించుకునే హక్కును పొందుతారు. ఈ క్రమంలో మొత్తం 12 మంది టెండర్‌దారులు రూ.500 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. పోటాపోటీగా సాగిన వేలం పాటలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన పుల్లయ్య రూ.35.60 లక్షలతో కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నారు. గ తేదాది రూ.28 లక్షలకు పలికిన వేలం పాట ఈ ఏడాది రూ.35.60 లక్షలకు ఖరారు కావడంతో రూ.7.60 లక్షల అదనపు ఆదాయం సమకూరినట్లైంది. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు కర్లకుంట రమేష్ బాబు, అంబటి నరసింహులు, వెంకట్రాముడు పాల్గొన్నారు.

వైభవం... జ్యోతుల మహోత్సవం

తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవమైన చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల ఉత్సవం బుధవారం ధర్మవరంలో వైభవంగా జరిగింది. మొత్తం 23 వార్డులలోని చౌడేశ్వరిదేవి ఆలయాల నుంచి దాదాపు 190 జ్యోతులను బుధవారం వేకువజాము 2 గంటల నుంచి ఊరేగించారు. జ్యోతులను తలపై పెట్టుకుని నృత్యం చేస్తూ భక్తి పాటలు ఆలపించారు. అనంతరం దుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ప్రవేశించి జ్యోతులను దించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేలాది భక్తులు తరలిరావడంతో ధర్మవరంలోని వీధులు జనసంద్రమయ్యాయి. కుల గురువు దివ్యజ్ఞానానందగిరి స్వామిజీతో పాటు మంత్రి సత్యకుమార్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ధర్మవరం అర్బన్:


పీఆర్‌టీ సర్కిల్‌లో నృత్యం చేస్తున్న తొగటవీర క్షత్రియులు


అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న దృశ్యం

చిరుత దాడిలో మేక మృతి


మృతి చెందిన మేక

గుడిబండ: చిరుత దాడిలో మేక మృతి చెందిన ఘటన గుడిబండ మండలం గుణేమోరబాగల్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన మేరకు... గుణేమోరబాగల్‌కు చెందిన హనుమక్క... జీవాల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జీవాలను తన పొలం వద్ద దొడ్డిలో వదిలి ఇంటికి వెళ్లింది. బుధవారం ఉదయం వెళ్లి చూసేసరికి ఓ మేక మృతి చెంది కనిపించింది. మెడపై చిరుత పంటి గాట్లను గుర్తించి సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ బీట్ ఆఫీసర్ సంజీవరాయుడు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చిరుత సంచారాన్ని గమనిస్తూ, దారి మళ్లించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అప్పటి వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వన్యప్రాణుల వల్ల నష్టం వాటిల్లితే బాధిత రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు.

'చెత్త' ఐడియా.. నిధుల దుబారా

జిల్లా కేంద్రం పుట్టపర్తిలో మున్సిపల్ అధికారులు ప్రజల సొమ్మును దుబారా చేస్తున్నారు. జవాబు దారీగా ఉండాల్సిన వారే కమీషన్లకు కక్కుర్తిపడి అద్దె వాహనాలతో కాలం నెట్టుకొస్తున్నారు. మరమ్మతుకు లోనైన చెత్త సేకరణ వాహనాలను గాలికి వదిలేసిన తీరే ఇందుకు నిదర్శనం.

- నిర్వహణ లేక మరమ్మతులకు లోనైన చెత్త సేకరణ వాహనాలు
- అద్దె ట్రాక్టర్లతో సరిపుచ్చుతున్న అధికారులు
- నెలకు రూ.2 లక్షల మున్సిపాలిటీ ఆదాయానికి గండి



పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం


మూలనపడిన చెత్త సేకరించే వాహనం

ప్రశాంతి నిలయం: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమంలో భాగంగా ఎనిమిదేళ్ల క్రితం పుట్టపర్తి మున్సిపాలిటీలో తడి, పొడి చెత్త సేకరణకు రెండు వాహనాలను కొనుగోలు చేశారు. ఒక్కో వాహనానికి రూ.16 లక్షల చొప్పున వెచ్చించారు. నిర్వహణా లోపం వల్ల పది నెలల క్రితం ఈ వాహనాలు మరమ్మతులకు లోనయ్యాయి. వీటిని మరమ్మతు చేయాలంటూ ఒక్కో వాహనానికి రూ.1.50 లక్షలు ఖర్చు అవుతుందని అప్పట్లో అధికారులు అంచనాలు రూపొందించారు. అప్పటి వరకూ ఆ అంచనాలు కార్యరూపంలోకి దాల్చలేదు. ఫలితంగా వాహనాలు కాస్త మూలనపడ్డాయి. వాహనాలను సుదీర్ఘకాలం వినియోగించకపోతే పూర్తిగా పాడైపోయే పరిస్థితి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

అద్దె ట్రాక్టర్లపై మక్కువ

ప్రభుత్వం మంజూరు చేసిన చెత్త సేకరణ వాహనాలను మూలన పడేసి ప్రైవేట్ వ్యక్తులకు చెందిన ట్రాక్టర్లను మున్సిపల్ అధికారులు అద్దెకు తీసుకుని చెత్త సేకరణ చేపట్టారు. ఈ క్రమంలో ట్రాక్టర్ల యజమానులకు నెలకు రూ.2 లక్షల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ప్రభుత్వం మంజూరు చేసిన వాహనాలు మూలన పడిన ఈ పది నెలల కాలంలో దాదాపు రూ.20 లక్షలను అద్దెల రూపంలో దుబారా చేయడం వెనుక అంతర్యమేమిటో మున్సిపల్ అధికారులకే తెలియాలి. రూ.3 లక్షలు వెచ్చించి చెత్త సేకరణ వాహనాలను మరమ్మతు చేయించి ఉంటే మున్సిపాలిటీకి రూ.17 లక్షల ఆదాయం మిగిలి ఉండేదని అంటున్నారు. కేవలం కమీషన్ల కక్కుర్తితో మున్సిపల్ అధికారులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

పన్నుల వసూళ్లూ అంత మాత్రమే!

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో వార్షిక పన్ను డిమాండ్ రూ.7.30 కోట్లు ఉండగా ఇందులో రూ.2 కోట్లు మాత్రమే వసూలవుతోంది. నిర్దేశించిన లక్ష్యంలో కనీసం 50 శాతం కూడా పన్ను వసూళ్లు కాని పరిస్థితి నెలకొంది. పన్నుల రూపంలో అరకొరగా వస్తున్న ఆదాయాన్ని సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన అధికారులు ఇందుకు విరుద్ధంగా దుబారా ఖర్చు చేస్తుడండంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చెత్త సేకరించేందుకు నాలుగు అద్దె ట్రాక్టర్లను తీసుకున్న అధికారులు.. ఒక్కో ట్రాక్టర్‌కు ప్రతి నెలా రూ.47,500 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే సమాధానం దాటవేస్తున్నారు.

పుట్టపర్తి మున్సిపాలిటీలోని వార్డులు	20
జనాభా	38,570
గృహాలు	16వేల వరకు

టెండర్లు పిలుస్తున్నాం



చెత్త సేకరణ వాహనాలకు మరమ్మతు చేయాలంటే రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అనంతపురంలోని షోరూంలో వాటికి మరమ్మతు చేయించాలి. ఈ ప్రక్రియ టెండర్ల ద్వారానే పూర్తి చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్లు ముందుకు వస్తే టెండర్లు పిలిచి వాహనాలను మరమ్మతు చేయిస్తాం.

– ప్రహ్లాద్, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

ఘనంగా గోదాదేవి కల్యాణం

తాడిపత్రి అర్బన్: గోవింద నామస్మరణ మధ్య గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రెడ్డివారిపాలెంలోని కోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాసం ముగింపు సందర్భంగా స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్యాహ్నం 12 గంటలకు వేదపండితుల సమక్షంలో కల్యాణం జరిపించారు. భక్తులు వివిధ రకాల పండ్లు, కానుకలను ప్రత్యేకంగా తయారు చేసిన పిండి వంటలను తీసుకువచ్చి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రికి తోటోత్సవం నిర్వహించారు.

నూనె బాండ్లిలో పడి చిన్నారి మృతి

- మరో ఘటనలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువకుడు

డి.హీరేహాళ్(రాయదుర్గం): సంక్రాంతి పండుగ వేళ రెండు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు, వేడి నూనెలో పడి మరో చిన్నారి మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం ఆవులదట్లకు చెందిన నాగలక్ష్మి, నవీన్ దంపతులు ఈ నెల 11న ఇంట్లో పూరీలు చేశారు. అనంతరం నూనె బాండ్లీని కింద పెట్టి ఇతర పనుల్లో నిమగ్నమయ్యారు. అదే సమయంలో వారి మూడేళ్ల వయసున్న కుమారుడు శ్రీనివాసులు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు వేడి నూనె బాండ్లీలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం కుటుంబసభ్యుల వెంటనే అనంతపురానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. చికిత్సకు స్పందించక బుధవారం చిన్నారి మృతి చెందాడు.


శ్రీనివాసులు


గణేష్ (ఫైల్)

విద్యుత్ షాక్‌తో...

డి.హీరేహాళ్‌కు చెందిన నాగరాజు, దేవమ్మ దంపతుల మూడో కుమారుడు గణేష్ (22) పెయింటర్‌గా జీవనం సాగిస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. మంగళవారం సోమలాపురంలో తిప్పేస్వామి ఇంటికి పెయింటింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి గోడపై నుంచి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బళ్లారిలోని వైద్యశాలకు తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. ఘటనపై ఎస్ఐ గురుప్రసాదరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహాసమాధిని సందర్శించిన ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ డైరెక్టర్


శ్రీరామ్ తనకంటికు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో ఉన్న పబ్లిక్ పాలసీ-పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌పై సివిల్ సర్వీసెస్ శిక్షణా సంస్థ (లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ – ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ) డైరెక్టర్ శ్రీరామ్ తనకంటి మంగళవారం ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. ఈ సరదంర్భంగా ఆయనకు శాంతి భవన్ అతిథి గృహం వద్ద కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ వి.రత్న, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ... పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయికుల్వంత్ సభా మందిరంలో ఆయన సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ముగిసిన కార్తికేయుడి బ్రహ్మరథోత్సవం


మూలవిరాట్‌కు పూజలు చేస్తున్న అర్చకుడు

పావగడ: ప్రసిద్ధి చెందిన పావగడ తాలూకా నాగలమడకలో ఉత్తర పినాకిని నదీ తీరంలో వెలసిన అంత్య సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం ముగిసింది. చివరి రోజు ఆలయంలో ప్రధాన అర్చకుడు బదరీనాథ్ నేతృత్వంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. ఆలయ ధర్మకర్త ఎం.అరుణ్‌కుమార్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

గోశాల నిర్వాహణకు ఆర్థిక సాయమందించండి

కూడేరు: ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రం సమీపాన ఏర్పాటు చేసిన గోశాల నిర్వాహణకు దాతలు ఆర్థిక సాయమందించాలని నిర్వాహకుడు ప్రవీణ్ స్వామి బుధవారం కోరారు. భక్తులు తమ మొక్కుగా ఆవులను సంగమేశ్వరుడికి కానుకగా వదిలారన్నారు. అలా వదిలిన ఆవులు వాటి సంతతి కలిపి సుమారు 100 వరకు ఉన్నాయన్నారు. ముగ్గురు వ్యక్తులకు వేతనాలు ఇస్తూ వాటిని గోశాలలో ఉంచి సంరక్షిస్తున్నామని ఆయన తెలిపారు. ఆవులకు గ్రాసం, సంరక్షకులకు జీతాలు ఇవ్వడానికి ఇబ్బందిగా ఉందన్నారు. దాతలు, భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

పోటాపోటీగా రాతిదూలం లాగుడు పోటీలు


కూడేరు: రాతిదూలం లాగుతున్న వృషభాలు

కూడేరు: జల్లిపల్లిలో సంక్రాంతి సందర్భంగా బుధవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో రాతి దూలం లాగుడు పోటీలు పోటాపోటీగా జరిగాయి. తోపుదర్తికి చెందిన చెన్నప్పకు చెందిన వృషభాలు మొదటి విజేతగా నిలిచి రూ.30 వేలు నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి. కర్ణాటక రాష్ట్రం ఆంద్రోల్‌కు చెందిన ఆనంద్ రెడ్డి వృషభాలు రూ.ద్వితీయస్థానంలో నిలిచి రూ.20 వేలు, అనంతపురం పట్టణం ప్రియాంకనగర్‌కు చెందిన ఓబుళపతి ఆచారి వృషభాలు తృతీయం స్థానంలో నిలిచి రూ.10 వేలు నగదును సొంతం చేసుకున్నాయి. ఈ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.


సత్యసాయిని పల్లకీని సభా మందిరంలోకి తీసుకువస్తున్న విద్యార్థులు


బ్రాస్ బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థులు


ట్రోఫీని అందజేస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయంలో వైభవంగా సంక్రాంతి


నృత్యరూపకంలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: సంక్రాంతి వేడుకలు ప్రశాంతి నిలయంలో కనుల పండువగా జరిగాయి. సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళనలో భాగంగా ఇటీవల నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను ట్రస్ట్ సభ్యులు అందజేశారు. బుధవారం ఉదయం యజుర్వేద మందిరం నుంచి బ్రాస్ బ్యాండ్ వాయిద్యం నడుమ సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగింపుగా సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధి చెంతకు చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యులు చక్రవర్తి, విద్యాసంస్థల వైస్ చాన్సలర్ ఆచార్య రాఘవేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత 'అవతార వైభవం' పేరుతో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది.